# తదనంతరం

"ఇందులో పాతిక వేలున్నాయి. ఇవి పూర్తిగా నీవే. వీటితో నువ్వు ఏది కావాలంటే అది కొనుక్కోవచ్చు. నాకు ఏలెక్కా చెప్పనక్కరలేదు" అంటూ డబ్బున్న లెదర్‌బాగ్ భార్య రాజమణి చేతిలో పెట్టారు కృష్ణయ్య.

"పాతిక వేలా! నా కెందుకూ?"

"రెండు వారాల క్రితం మనమధ్య జరిగిన వేడివేడి సంభాషణ గుర్తులేదూ? 'మీ తదనంతరం ఎన్ని లక్షలొస్తే నాకెందుకూ? బ్రతికుండగా ఖర్చు చేసుకుని నాలుగు కోర్కెలూ తీర్చుకోకుండా ఎప్పుడో బాగా ముసలి అయిపోయాక, మీ తదనంతరం, ముండమోపి బ్రతుకు బ్రతుకుతూ వచ్చిన డబ్బుతో నేనేం చేసుకోను. కనీసం ఆ ముసలివయసులో కోరిన తిండి తిన్నా అరిగిచావదు' అన్నావుగా. నువ్వన్న మాటలు ఆలోచించాను. అందుకే ఈ డబ్బు నీకిస్తున్నాను తీసుకో"

"ఓ అదా? అప్పుడేదో ఆవేశంలో మాటమీద మాట పెరిగి పంతానికి ఏదో అనేసి వుంటాను. నా దగ్గిరెందుకు అంత డబ్బు?" అని డబ్బుతో బరువుగా వున్న లెదర్‌బాగ్ టేబిల్ మీద పెట్టేసింది.

రాజమణికి ఠక్కున గుర్తొచ్చింది. పాస్‌బుక్‌లో అంత డబ్బులేదు. మహావుంటే అయిదారు వేలుంటుందేమో. పైగా పాస్‌బుక్ ఎప్పుడూ బీరువాలోనే వుంటుంది. తననడిగే తీసుకువెళతారు. ఈ మధ్య తనని పాస్‌బుక్ అడగలేదు కూడానూ, మరి ఈ డబ్బు ఎలా వచ్చినట్టు?

ఆ మాటే అడిగింది మొగుణ్ణి.

ప్రావిడెంట్ ఫండ్‌లోంచి పార్ట్ ఫైనల్ విత్ డ్రా యల్ పెట్టి, పాతికవేలూ తీశాడట.

ఇద్దరు కూతుళ్ళకీ పెళ్ళయి కాపురాలు చేసుకుంటున్నారు. చిన్న కూతురుకింకా పెళ్లి కాలేదు. కృష్ణయ్యకు మరొక ఆరేళ్ళు సర్వీసుంది. (యాభై ఎనిమిదేళ్లకు రిటైరుమెంటయితే) ఇల్లు కట్టించుకోవాలన్న చింతలేదు స్వంతయిల్లు యిప్పటికే వుంది, పిత్రార్జితం. అంచేత కృష్ణయ్యకేం జంజాటాలూ, బాదర బందీలు లేవనే చెప్పొచ్చు.

అయితే కృష్ణయ్య ఆలోచనలు కృష్ణయ్యకున్నాయి.

రిటయిరయిన తరువాత, పాతకాలపు డాబా యింటికి రిపేర్లు చేయించి, మేడ మీద అన్ని సౌకర్యాలతో రెండు గదులు, బాత్‌రూము వగైరాలు కట్టించుకుంటే తామిద్దరూ వుండొచ్చు. దిగువ యిల్లు అద్దెకి యివ్వచ్చు. ఇహ మూడో కూతురు పెళ్ళి చెయ్యాలి. ఇవీ ముఖ్యమైన పనులు. కనుక డబ్బు ఆదా చేస్తున్నాడు.

మరి, రాజమణి ఆలోచన్లు రాజమణి కున్నాయి. మొదటి కూతురికీ, రెండో కూతురికీ పెళ్ళిళ్ళు చేసి పంపేసరికి ఎక్కడలేనిఖర్చూఅయ్యింది. కట్నాల బాధ అంతగా లేని మాట నిజమేగాని, ఇద్దర్నీ డిగ్రీవరకూ చదివించారు. మూడోకూతురు వుండనే వుంది. తనకి లింగూ, లిటుకుమని రెండంటే రెండు రెండు గాజులున్నాయి, ఆ చేతికొకటీ ఈ చేతికొకటిను. కనీసం ఆ చేతికి రెండూ. ఈ చేతికి రెండూ వుంటే బావుండునని ఎన్నాళ్ళనుంచో అనుకుంటోంది మంగళసూత్రాలు ఎప్పటి పెళ్ళినాటివి. ఇప్పుడు ఎన్నెన్ని కొత్త మోడల్ వస్తున్నాయో. చెవులకున్న దుద్దులూ పాతవి అరిగిపోయి, మట్టిపట్టి వెలవెల బోతున్నాయి. అవీ కొత్తవి చేయించుకోవాలి. ఇక తనకు ఏమంత మంచి చీరలున్నాయి గనక? ఎదురింటి ట్రెజరీ గుమాస్తా మోహనరావుగారి భార్యకు ఎన్ని నగలు ఎన్ని చీరలు? తనకి వెయ్యి రూపాయల చీర ఒక్కటి కూడా లేదు.

అన్నిటికన్నీ మూడొందలూ, నాలుగొందలూ చీరలే, పైగా తను గెజిటెడ్ ఆఫీసరు భార్య. కాని, ఐదుపైసలు పైసంపాదన లేని వాడిభార్య. పై రాబడి లేనిదే హెూదాలు ఎక్కణ్ణించి వస్తాయి? ఆ మాత్రం రాజమణికి తెలుసును.

ఆ మధ్య భార్యాభర్తలకి మధ్య జరిగిన కీచులాటలో ఈ మాటలన్నీ అడిగింది. తనకి ఏ కోరికలూ తీరటంలేదని వాపోయింది. తినడానికి తిండీ, కట్టడానికి బట్టా వుంటే సరా? ఆడదన్న తరవాత ఓ అచ్చటా ముచ్చటా తీరొద్దూ.

"నాచేతినిండా డబ్బేవుంటే, నేనూ ఉద్యోగస్తురాల్నయితే అయిందానికీ కానిదానికీ మిమ్మల్ని దేబిరించవలసిన అగత్యం వుండకపోను" అంది. "గతిలేక కుక్కినపేనులా పడి వుంటున్నాను" అని ఝూడించేసింది. ఆవేశం వస్తే రాజమణి చాలా తీవ్రంగా వుంటుంది. మొగుడని కూడా చూడకుండా మాటలు విసిరేస్తుంది.

"నీకేం లోటొచ్చిందని అలా తెగబాధపడిపోతున్నావు. పిల్లలిద్దరికీ పెళ్ళిళ్ళు చేశామా! ఇంకా చిన్నది వుండనే వుంది. అయినా నీ మాటకి దేనికి కాదన్నాను. గొలుసు చేయించుకుంటివి. చీరలు నీ యిష్టమేనాయే. డబ్బంటావా? రిటయిరయ్యేసరికి నాకు ఎంత లేదన్నా అన్ని విధాలా రావలసింది కలుపుకుని, రెండు లక్షల అరవయివేలవరకూ వస్తుంది. మొన్ననే లెక్కలు చూశాం. ఈ ముక్క నీకు చెప్పనే చెప్పాను. ఈ లోపున నాకేమన్నా అయితే ఆ డబ్బంతా పైసల్తోసహానీకే వస్తుంది. పైగా మన పిల్లల్లో ఒకరికి ఉద్యోగం యిస్తారు. నీకు బ్రతికినంతకాలం నెలనెల పరిహేనువందల వరకూ పెన్షనొస్తుంది" అన్నాడు కృష్ణయ్య.

"వూరుకోండి. అంత మాటంటారు దేనికి? మీరు చల్లగావుంటే అదే పదివేలు. మీరే లేకపోయేక నాకు ఆ డబ్బు దేనికి?" అంటుందని కృష్ణయ్య ఎదురు చూశాడు. రాజమణి అలా ఎంతమాత్రం అనలేదు.

"ఎప్పుడో రిటయిరయ్యాకానూ, మీ తదనంతరమూను నాకు ఎంత ఆస్తివస్తే మాత్రం ఎందుకు? ఇప్పుడిస్తే చక్కగా కాలుమీద కాలు వేసుకుని అనుభవించవచ్చు. కాలంనాడు కోరికలు చంపుకుని బ్రతికి చచ్చాక సరదాలు తీర్చుకోమంటే– అదేం న్యాయమూన మాట?" ఇలా సాగింది. పదజాలం ఇంతకంటే పరుషంగానూ. జోరుగానూ దొర్లింది. కృష్ణయ్య అవాక్కయిపోయాడు. ముళ్ళకొరడాతో బాదినట్టయింది. నిలువునా నిప్పుల్లో కూరినట్టయింది. ఇప్పుడు ఆమె ఆవేశపడి. తనూ ఆవేశపడి ఇద్దరూ మాటలు విసురుకుని చివరికి తను భార్యని తిడితే ఆమె అంత కంటే నోరు పారేసుకుంటుంది. ఆఖరికి ఏడుపుతో, అసహ్యకర వాతావరణంతో ఇల్లు గందరగోళంగా భయానకంగా తయారవుతుంది. పంతాలు పెరిగిపోతాయి. కృష్ణయ్యకి ఇది అనుభవమే, కష్టంమీద ఓర్పువహించి, కోపం దిగమింగాడు.

అవసరంకోసం, మనుగడకోసం కాకుండా, డబ్బుకోసం కాకుండా విడిగా స్త్రీ ఎవర్నీ ఆఖరికి భర్తని కూడా గౌరవించదన్నమాట. కనీసం అతనికి భద్రత కూడా కోరుకోదన్నమాట! అలాగే పురుషుడూను. అంటే స్త్రీ పురుషసంబంధాలు ఆర్థిక సంబంధాల ప్రతిబింబాలే. ఇది కూడా కృష్ణయ్యకు అనుభవంమీద తెలిసివచ్చింది. రోజులు గడుస్తున్నకొద్దీ అతని మనసులో ఆలోచనలు మలుపులు తిరిగాయి.

నిజమే, స్త్రీకి కోరికలుంటాయి. సాధారణ మధ్యతరగతికి చెందిన గృహిణులకు అవి తీర్చుకునే మార్గాలుండవు. జీవితం అంటే– కేవలం ఆకలి తీర్చుకుందుకు ఇంత అన్నం , వొళ్లు కప్పుకుందుకు బట్టా. చీకటిచాటున ఇరుకుగదుల్లో నరాలవేడి చల్లార్చుకోవడం, పిల్లల్ని కనిపెంచడం ఇది మాత్రమే కాదుకదా. మంచి బట్టా, కోరిన తిండీ, నగానట్రా ఈపాటి కోర్కెలు తీర్చని భర్తని ప్రేమగా చూడవలసిన అగత్యం స్త్రీకి ఎందుకుంటుంది?

బిడ్డల్ని కంటూ నిరంతరం చాకిరీచేస్తూ కట్టుబానిసలా బ్రతుకుతున్న స్త్రీకి కేవలం తిండీ బట్టేకాదు. స్వేచ్ఛనివ్వాలి. కొంత డబ్బుఇచ్చి తీరాలి. తనదీ అనే ఆర్థిక ప్రతిపత్తి లేకపోతే స్త్రీకి ధైర్యం ఎలా వస్తుంది. సమస్త ప్రయోజనాల అంతిమలక్ష్యం ఆర్థికంగానే తప్ప మరోలా నెరవేరే దారిలేదు. ఎప్పుడో భర్త తదనంతరం డబ్బు చేతికొస్తుందంటే ఏం లాభం? పైగా పరిస్థితులెలా వుంటాయో? కొడుకులూ, కోడళ్ళూ చేరి ఆ డబ్బు దక్కనిస్తారో లేదో! ఎంతమంది పడుతున్న అగచాట్లు చూస్తున్నాం కాదు.?

ఆలోచనలు సుళ్లు తిరిగేసరికి కృష్ణయ్యకు ఆవేశం చల్లారింది.

పాస్‌బుక్‌లో సుమారు అయిదు వేలున్నాయి. ఆదాయపుపన్ను పడకుండా ఎన్.ఎస్.ఎస్.బాండ్లు కొన్నాడు. పోస్టల్ ఇన్సూరెన్స్ తీసుకున్నాడు. అదిగాక వేరే ఇన్సూరెన్సు వుండనే వుంది. ప్రావిడెంట్ ఫండ్ తదితర కోతలు సరేసరి. కాస్త జీతం పెరిగినా చిక్కి లావుంటోంది. దొంగలెక్కలు చూపే వ్యాపారస్తుల్ని, కాంట్రాక్టర్లన్నీ, సినీస్టార్లనీ, బ్లాక్‌మనీగాళ్లనీ ఏం చెయ్యలేకపోతోంది. సామాన్య ఉద్యోగస్తుల దగ్గర చెవులుపిండి వసూలుచేస్తోంది పన్ను– ఛి..... ఛీ! ఏం రూల్సో.... ఏం గవర్నమెంటో

సరే.... ఇంతకూ ఇప్పుడేం చెయ్యాలి? బాగా ఆలోచించి, ప్రావిడెంట్‌ఫండ్ లోన్ పెట్టాడు. గుమాస్తాకి ఇచ్చుకోవలసిన లంచం ఇచ్చుకుని బిల్‌పాస్ చేయించి డబ్బు తెచ్చాడు.

రాజమణి ఆనాడు మరొకమాట కూడా అనకపోలేదు.

"ఉద్యోగధర్మం చేతనో, మరొక కారణం చేతనో మీరు చాలా ఊళ్ళూ, కొత్త ప్రాంతాలూ తిరిగి వస్తుంటారు. సరదాలు తీరుతూ వుంటాయి. నేనెక్కడికి తిరగాలి. పుస్తె కట్టింది మొదలు ఇంట్లోపడి చావాల్సిందే. మీరు వూళ్ళు తిరిగివస్తుంటే కుక్కలా యింటికి కాపలా కాస్తుండాలి. మా చెల్లి వాళ్లు బొంబాయి టూరు వెళ్తుంటే పంపించమని అడిగితే పంపేరుకాదు. పోన్లే మంచిదే అయింది. కొత్తగా పెళ్లయినవాళ్ళు . వాళ్ళమధ్య నేనెందుకులే అని సరిపెట్టుకున్నాను. మా చిన్నాన్నా వాళ్ళూ తిరపతి వెళ్తుంటే అప్పుడూ పంపేరు కాదు. ఇక బయటి ప్రపంచం చూడాలనే నా కోరిక తీరేమార్గం ఏదీ? ఇలా అన్నానని మీరు కోపం తెచ్చుకోకండి. నా తదనంతరం తీర్థయాత్రలు సేవించమని మీరు సలహా చెప్పొచ్చు. ఇక నా బ్రతుకులో అన్నిటికీ మీ తదనంతరమే"

కృష్ణయ్య భరించలేకపోయాడు. వొళ్ళంతా కారం రాసుకున్నట్టయింది. పెట్రోలుపోసి తగలబెడుతుంటే వొళ్లంతా తెలుస్తూండగానే భగ భగ మండిపోయినట్టయింది. తనతో దగ్గర దగ్గర ముప్పయి సంవత్సరాలుగా కాపురంచేసిన కట్టుకున్న పెళ్ళాం నోటివెంట ఇవ్వాళ ఎటువంటి మాటలు వింటున్నాడు.!

నిజమే.... కాన్ఫరెన్సుల పేర, సెమినార్లపేర తను ఇండియాలోని ముఖ్యపట్టణాలన్నీ ప్రభుత్వం ఖర్చుతో తిరిగాడు . విద్యార్థులతో స్టడీటూర్ పేర కొన్ని ప్రాంతాలు తిరిగాడు. ఒక్క సారి, ఒకే ఒక్కసారి బొటానికల్ టూర్‌లో భార్యని బొర్ర. అరకు, మాచ్‌ఖండ్ ట్రయిన్ మీద తీసుకెళ్ళాడు. పొంగిపోయింది. అంతే, అంతకుమించి ఎక్కడికీ తిరగలేదు.

ఘర్షణ జరిగాక ఈ రెండు వారాల్నించీ ఈ సంగతులన్నీ గుర్తుతెచ్చుకుని ఆలోచిస్తున్నాడు.

తల్లిదండ్రులు బ్రతికివుండగా అనేక కారణాలవల్ల పిల్లలకు ఆస్తి పంచియివ్వకపోతే, వాళ్ళపై కొడుకులు చేసే తిరుగుబాటు గురించి ఆలోచించాడు. కొడుకుల్ని నూటికి నూరుపాళ్ళూ బలపరచలేకపోవచ్చు. కాని వాళ్ళకి ముసలివాళ్ళపై కోపం వుండటాన్ని కృష్ణయ్య అర్థంచేసుకోగలిగాడు ఇన్నాళ్ళకి. అంతేకాదు స్వంత ఆస్తి అనేది కుటుంబసంబంధాల్లో ఎంతటి నిర్ణాయకమైన పాత్రను నిర్వహిస్తున్నదో క్రమంగా తెలిసివచ్చి, ఇన్నాళ్ళ తన అజ్ఞానానికి సిగ్గుపడ్డాడు.

భార్యని పిలిచి మనస్ఫూర్తిగా చెప్పాడు.

"ఈ మాట కూడా విను. ఇకపై నేను కాన్ఫరెన్స్ పేర ఎక్కడికయినా వెళితే వీలయినంతవరకూ నిన్ను కూడా తీసుకువెళ్ళే ప్రయత్నం చేస్తాను. రేపే నీ పేర బాంక్ ఎకౌంట్ ఓపెన్‌చేసి ప్రతినెలా నీ పేరా కొంత డబ్బు వేస్తుంటాను. ఏదీ ఇక నువ్వు నా తదనంతరం వరకూ వాయిదా వెయ్యనవసరంలేదు. నీ కోరికలు ఎప్పటికప్పుడు ఇప్పుడే వెంటవెంటనే తీర్చే ప్రయత్నంచేస్తాను. ఇన్నాళ్లూ నిన్ను నేను సరిగ్గా అర్థం చేసుకోలేకపోయాను. ఇప్పుడు తెలిసింది. ఇకపై అలా జరగదు."

"చాల్లెండి ఇక" అన్నది రాజమణి భర్తని, ఇక ఆపండి మీ మాటలు అన్నట్టు. ఆమె తన చెవుల్ని తానే నమ్మలేకపోయింది.

కృష్ణయ్య క్కూడా తన మాటలు తనకి కొత్తగానే వున్నాయి.

ఆవేశంతో ఏదో డబ్బు తెచ్చి యిచ్చేశాడే గాని, అన్నమాట నిలబెట్టుకుని అన్ని పనులూ నిజంగానే చేస్తాడా?

రాజమణి కిటికిలోంచీ వీధిలోకి చూసింది సూర్యతేజంతో ప్రపంచం వెలిగిపోతున్నట్టు కనిపించింది.

టేబిల్ మీద డబ్బుతో లావెక్కి వున్న లెదర్‌బాగ్ వాళ్ళిద్దరిమద్యా జీవంలేని వస్తువులాగా అలాగే వుండిపోయింది.

*రచన : 24-4-92.*

*ప్రచురణ : విపుల, మార్చి 1993.*